క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ


రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో మూడో స్థానం సాధించిన బాలుర, బాలికల జట్లతో సభ్యులు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు మూడో స్థానం దక్కింది. కర్నూలు జిల్లాలో ఈ నెల 28, 29 తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొన్న బాలుర జట్టుకు మూడో, బాలుకల జట్టుకు మూడో స్థానం దక్కింది. జిల్లా టీమ్‌కు కోచ్ మేనేజర్లుగా పీడీ శేషుకుమారి, కె.నాగలింగేశ్వరరావు, వంశీ, కోచ్ పి.లక్ష్మణరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్ మేనేజర్లను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ సభ్యులు, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం తదితరులు అభినందించారు.

నేడు యథావిధిగా గ్రీవెన్స్

పెద్దాపురం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్)ను సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో భాగంగానే ఈ వారం ఉదయం 10 గంటల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని డివిజన్ పరిధిలోని 11 మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీచ్ రోడ్డులో వాహన తనిఖీలు


ఉప్పాడ బీచ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పిఠాపురం సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉప్పాడ బీచ్ రోడ్డులో ఆదివారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని 15 వాహనాలకు సంబంధించి ఈ చలానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో మద్యం తాగి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్ సిబ్బంది ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


సామర్లకోటలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక కన్యకా పరమేశ్వర సత్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. సామర్లకోటలో భవర్‌లాల్ డి.జైన్ కుటుంబ సభ్యులు ఆదివారం కిరణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 60 మందిని శస్త్రచికిత్సలకు గుర్తించారు. వీరికి కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు ఉచితంగా చేయించనున్నారు. కిరణ్ కంటి ఆస్పత్రి సూపర్‌వైజర్ సత్యనారాయణ పర్యవేక్షణలో సుమారు 20 మంది సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఊరా సత్యనారాయణ, నాగమణి, కాపుగంటి పైడిరత్నం, కర్రి ఆదినారాయణరెడ్డి, కంచర్ల సుబ్రహ్మణ్యం, గొల్లపల్లి శ్రీనివాసరావు, మోహన్‌రావు మాస్టారు, మార్వాడీ వ్యాపారస్తులు సేవలందించారు.

విద్యార్థులకు పరుపుల పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక గాంధీనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ పరుపులను ఆదివారం అందించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ సీపోర్ట్సు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాకినాడ సన్‌రైజ్ హాస్టల్ విద్యార్థులకు పరుపులు అందించడం హర్షనీయమన్నారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీకృష్ణవర్మ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు పరుపులు అవసరం ఉందని సూపరింటెండెంట్ తమ్మన్నదొర ద్వారా తెలుసుకుని, రూ.లక్షతో కొనుగోలు చేసి తమ క్లబ్ తరపున అందించామన్నారు. క్లబ్ సభ్యుడు వి.శ్రీనివాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ప్రసాద్‌బాబు, శేషుకుమార్, సభ్యులు సాయి సుందర్, ఆశా, విజయలక్ష్మి, నగధర్, రుత్విక్ బాలాజీ, హరిప్రసాద్, నంద కిశోరుడు పాల్గొన్నారు.

సమస్యల కొనసాగుంపు

- వీధి కుక్కలకు ఆగిన కు.ని. శస్త్రచికిత్సలు
- నిధులు రాక ఎదురైన ఇబ్బంది
- వెంటాడుతున్న గ్రామ సింహాలు


సామర్లకోటలో గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు

సామర్లకోట: భౌ.. భౌ.. అంటూ మళ్లీ గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. ఏ వీధి చూసినా, ఏ సందులోనైనా, నిర్మానుష్య ప్రాంతమైనా, జనం సంచరించే చోటైనా ఇలా ఎక్కడైనా తిష్టవేస్తున్నాయి.. కనిపించిన వారిపై దాడికి దిగుతూ హడలెత్తిస్తున్నాయి.. సామర్లకోట పట్టణంలో రోజు రోజుకూ ఈ పరిస్థితి చేయిదాటుతోంది. పట్టణ విస్తీర్ణం 14.8 చదరపు కిలోమీటర్లు కాగా జనావాసాలు రానురాను పెరుగుతున్నాయి. సౌకర్యాల కల్పన మాత్రమ నామమాత్రంగానే ఉంది. పట్టణంలో కుక్కల సమస్య నానాటికీ పెరిగిపోతోంది. ఎక్కడ బడితే అక్కడ కుక్కలు గుంపులు గుంపులుగా చేరి ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. స్థానిక స్టేషన్ సెంటర్, బలుసులపేట, బ్రౌన్‌పేట, కొత్తూరు, సత్యనారాయణపురం, వీర్రాఘవపురం, పెన్షన్ లైన్లలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో కుక్కకాటుకు గురవుతున్న వారెందరో ఉంటున్నారు.

గుర్తించారు.. ఏం చేశారు!

పట్టణంలో గత ఆరు నెలల కిందట వీధి కుక్కల నియంత్రణలో భాగంగా వీటి సంఖ్యను లెక్కించారు. సుమారు 500 వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. వీటి సంతతి నియంత్రణలో భాగంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని భావించారు. ఇందుకు గాను ఒక్కో కుక్కకు రూ.1,500 కేటాయించాల్సి ఉంది. అయితే 100 కుక్కలకు కాకినాడ తీసుకెళ్లి మరీ ఆపరేషన్లు చేయించారు. అయితే ఈ బిల్లులు రాకపోవడంతో ప్రక్రియ మూలకు చేరినట్లు సమాచారం. దీనివల్ల 500 కుక్కల కాస్త రెట్టింపు స్థాయికి చేరినట్లు ప్రజలు చెబుతున్నారు. ఏదేమైనా పరిస్థితిని ఇలానే వదిలేస్తే సమస్య మరింత జఠిలం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కుక్క కరిస్తే..

కుక్క కరిస్తే వెంటనే యాంటీ రాబిస్ వ్యాక్సిన్ చేయించుకోవాలి. ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వాస్పత్రిల్లో ఉచితంగా వేస్తారు. బయట ఒక డోసు రూ. 500 నుంచి రూ. 800 వరకూ ఉంటుంది. కుక్కకాటుకు గురైన వ్యక్తి తప్పనిసరిగా వైద్యులు సూచించిన ప్రకారం డోసు వేయించుకోవాలి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఈ వ్యాక్సిన్ కొరత ఉందని పలువురు అంటున్నారు. దీనిపై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అమలను వివరణ కోరగా వ్యాక్సిన్ కొరత లేదని చెప్పారు. వ్యాక్సిన్ ఓపెన్ చేస్తే పాడైపోతుందని, దీనివల్ల సాయంత్రం, రాత్రి సమయాల్లో వచ్చిన బాధితులను ఉదయం రావాలని సూచిస్తున్నామన్నారు. రాబిస్ వ్యాక్సిన్ స్టాక్ అయిన వెంటనే తిరిగి తీసుకువస్తున్నామని చెప్పారు.

ప్రతి వార్డులోనూ ఇంతే..


ప్రతి వార్డులోనూ కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఎండలకు ఇవి అనారోగ్యానికి గురై జనంపై దాడులకు దిగుతున్నాయి. రోడ్లపై తిరుగుతున్న కుక్కలను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుని వాటిని ఒక ప్రదేశంలో ఉంచి సంరక్షించాలి. వీటికి శస్త్రచికిత్సలు చేసే ప్రక్రియ కాగితాలకే పరిమితం అయ్యింది.

–వేగి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, సామర్లకోట

ఒక్కో జీవానికి రూ.1,500


పట్టణ పరిధిలో కుక్కల బెడదపై ఫిర్యాదులు అందుతుండడంతో వాటికి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించాం. స్థానికంగా సుమారు 500 వరకూ వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించాం. తొలి విడతగా 100 కుక్కలకు ఆపరేషన్లు చేయించాం. ఆపరేషన్లు చేయించిన తరువాత ఎక్కడి కుక్కలను అక్కడే విడిచి పెడుతున్నాం. ఒక జీవానికి రూ.1,500 చొప్పున కేటాయించాల్సి వస్తుంది. దీనికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆపరేషన్లు ఆగిపోయిన మాట వాస్తవమే.

–ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

సామర్లకోటలో వరుస చోరీలు


సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

సామర్లకోట: స్థానిక ప్రధాన ప్రాంతాల్లో శనివారం రాత్రి వరుస దొంగతనాలు జరిగాయి. పాన్, కిరణా షాపుల్లో చోరీలు జరగ్గా, హోటల్ వద్ద రాత్రి పని చేయడానికి వచ్చిన వ్యక్తి మోటార్ సైకిల్ కనిపించకుండా పోయింది. మఠం సెంటర్‌లోని మద్యం షాపు ఎదురుగా ఉన్న పాన్ షాపులో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపులో ఉన్న సీసీ కెమెరాలోని దృశ్యాల ఆధారంగా ముగ్గురు యువకులు స్కూటీపై వచ్చి షాపు తాళాలు పగులకొట్టినట్లు గుర్తించారు. ఇద్దరు యువకులు షాపులోనికి ప్రవేశించగా, ఒక యువకుడు షాపు బయట ఉంచి గమనించాడు. షాపులో ఎక్కువ మొత్తంలో నగదు ఉంటుందని ఆశించిన వారికి నిరాశ మిగిలినట్లు తెలిసింది. షాపులో సీసీ కెమెరాను దొంగలు ధ్వంసం చేశారు. షాపులో రూ.15 వేలు అపహరించారని యజమాని దంగేటి శ్రీను తెలిపారు. అదేవిధంగా మఠంసెంటర్‌లోని ఒక కిరణా షాపులో రూ. రెండు వేలు చోరీ జరిగినట్లు యజమాని గోపాలం తెలిపారు. రైల్వే స్టేషన్ సెంటర్‌లో హోటల్ వద్ద మోటారు సైకిలు చోరికి గురైందని బాధితుడు సీలం క్రాంతి స్వరూప్ తెలిపారు. రాత్రి షాపులో పెయింటింగ్ వేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇటీవల పెద్దాపురం రోడ్డులోని ఒక సెల్ షాపులో భారీ చోరీ జరిగి 15 రోజులు గడవక ముందే మళ్లీ అదే రోడ్డులో దొంగతనాలు జరగడంపై వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా బోనాల సంబరం


సంబరంలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

సామర్లకోట: మండల పరిధిలోని నవర గ్రామంలో వేంచేసి ఉన్న ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి బోనాల సంబరం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు, ఆలయ ధర్మకర్త దమ్మాల లక్ష్మణరావు, వీరనాగమణి దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. గరగలు, వీరభద్రుని నృత్యం, బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య బోనాల సంబరం గ్రామం అంతా పర్యటిస్తూ సాగింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి సర్పంచ్ దంపతులు బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం, చవితిని పురస్కరించుకుని ఈ సంబరం నిర్వహించామని సర్పంచ్ లక్ష్మణరావు చెప్పారు. వందలాది మంది మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకను తిలకించడానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శివసుబ్రహ్మణ్యం పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు.


నవరలో అమ్మవారి బోనంతో సర్పంచ్ తదితరులు

2న గొల్లప్రోలులో వైఎస్సార్ సీపీ సమావేశం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత


నాయకులతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: వచ్చే నెల 2వ తేదీ బుధవారం గొల్లప్రోలు సత్యకృష్ణ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సమావేశ నిర్వహణపై పార్టీ క్యాడర్‌తో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలతో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామన్నారు. దీనికి పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా నేతృత్వంలో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. దీనికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సంస్థాగత ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ ముఖ్య నేతలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు ప్రజలను మోసగిస్తున్న తీరును ఎలా ఎండగట్టాలనే దానిపై పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను ప్రభుత్వం మోసగించిందన్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకుని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అయినప్పటికీ ప్రజల తరఫున పార్టీ ఎప్పుడూ పోరాటం చేస్తూనే ఉంటుందని, దానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే ప్రజలు కూటమి ప్రభుత్వంపై, ఆ పార్టీ నేతలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రజలకు అండగా ఉండి వారి తరఫున పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అందరూ కలసి పని చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ అరాచకాలపై పోరాటం

- వైఎస్సార్ సీపీ పంచాయతీ విభాగ జిల్లా అధ్యక్షుడు 'మోరంపూడి'
- నేడు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మోరంపూడి శ్రీరంగనాయకులు

సామర్లకోట: కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై పోరాటం చేస్తున్నామని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు ప్రకటించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఉపాధి హామీ పథకానికి సంబంధించి జరుగుతున్న అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం ఉపాధి పనులు గ్రామ పంచాయతీల ద్వారా జరిగే విధంగా చూడాలని, కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. సర్పంచ్‌లందరికి తల్లికి వందనం అందే విధంగా చూడాలని తెలిపారు. సర్పంచ్‌లలో అనేక మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వాడుకొంటుందని ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసిన రూ.1,150 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుల చెల్లింపులో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73, 74 సవరణల మేరకు సర్పంచ్‌లకు ఉన్న అధికారాలను అమలు చేయాలని సూచించారు. జీఓ ఎంఎస్ నంబరు 11ను రద్దు చేసి, గాలిలో ఉన్న 1,350 మంది పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు ఇచ్చి 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వ హామీ మేరకు, గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్నులను స్థానిక సంస్థల ఖాతాలలో జమ చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలకు హామీ ఇచ్చిన విధంగా గౌరవ వేతనాలను పెంచాలని, ఇప్పటి వరకూ ఉన్న బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటిపై సోమవారం జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందజేస్తామని వివరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పంచాయతీరాజ్ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వీరబాబు, జిల్లా అధికార ప్రతినిధి ఇనకొండ విష్ణుచక్రం, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, గుడివాడ సర్పంచ్ కనపర్తి సీమదొర, పవర ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన కామేశ్వరరావు, పెద్దాపురం సోషల్ మీడియా కన్వీనర్ జ్యోతుల నాగు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ మేనేజర్‌కు సత్కారం


కాంప్లెక్స్ మేనేజర్ వజ్రం దంపతులను సత్కరిస్తున్న షాపుల యజమానులు

సామర్లకోట: కాకినాడ డిపోలో సుమారు 36 ఏళ్ల పాటు విధులు నిర్వహించి, సామర్లకోట బస్ కాంప్లెక్స్ మేనేజర్‌గా వచ్చి సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్న చేట్ల వజ్రం, నాగరత్నం దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కౌన్సిలర్ సేపెని సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వజ్రం కాంప్లెక్స్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత కాంప్లెక్స్‌కు ఆదాయం వచ్చే విధంగా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా రూమ్స్ నిర్మించారని తెలిపారు. కాంప్లెక్స్‌లో వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా తానున్నానంటూ భరోసా ఇచ్చే వారని అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూపా, బస్సు కాంప్లెక్స్ వ్యాపారస్తులతో పాటు ప్రసాద్, కుమార్, బిక్కిన సాయిచక్రధర్, గుణ్ణం చౌదరి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

కరప: గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం కేసు వీడింది. బాలిక ఫిర్యాదు మేరకు, కిడ్నాప్ చేసిన యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. కరపకు చెందిన ఓ వ్యక్తి కుమార్తె 8న స్నేహితురాలి బర్త్ డే ఫంక్షన్‌కు అని చెప్పి, బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించకపోవడంతో బాలిక అదృశ్యంపై కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేశారు. తమ కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. తిమ్మాపురం ఎస్ఐ గణేష్, కరప స్టేషన్ కానిస్టేబుల్ శివ బృందం గాలింపులో హిందూపురం సమీపంలో బాలిక, నిందితుడు బుద్దాల మణికంఠ కనిపించారు. నిందితుడు పరార్ కాగా సదరు బాలికను ఆదివారం కరప పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు.

సెల్ టవర్ వద్దంటూ ఆందోళన


సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని ఆందోళన చేస్తున్న పిఠాపురం వెలంపేట ప్రజలు

పిఠాపురం: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలంటూ పిఠాపురం వెలంపేట ప్రజలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సెల్ టవర్ రేడియేషన్ వల్ల మహిళలకు అనేక రుగ్మతలు వస్తున్నాయని అన్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిర్మాణాన్ని ఆపివేయాలని, లేదంటే మరింత తీవ్రంగా ఉద్యమం చేపడతామని మహిళలు హెచ్చరించారు. ఈ విషయంపై పిఠాపురం ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలన్నారు.

లోకహితం కోసం వారాహి హోమాలు

బోట్‌క్లబ్: వారాహి నవరాత్రుల సందర్భంగా వేద విజ్ఞాన ప్రతిష్టానం, అఖిల భారత జ్యోతిష సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలోని ప్రతిష్టాన కార్యాలయంలో ఆదివారం వారాహి హోమాలను వేద పండితుడు దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. లోకహితంతో పాటు ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవనం సాగించాలన్న ప్రధాన ఉద్దేశంతో ప్రతి ఏడాది క్రమం తప్పకుండా వారాహి నవరాత్రులను నిర్వహిస్తున్నామని జ్యోతిష పండితుడు ఫణిశర్మ అన్నారు.

తీరం... శిథిల సాక్ష్యం


ఉప్పాడలో కోతకు గురైన గృహాలు

కొత్తపల్లి: శిథిల భవనాలు.. కొట్టుకుపోయిన రోడ్లు.. అక్కడ చూస్తే భూకంపాన్ని తలపిస్తోంది. ఉప్పాడ తీరానికి నానాటికీ రక్షణ లేకపోయింది. ఈ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు నిర్మించిన జియోట్యూబ్ (రక్షణగోడ) పూర్తిగా సముద్ర గర్భంలో కలసిపోయింది. ఇక్కడ మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నో భారీ తుపాన్లు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లను ఈ రక్షణ గోడ ఎదుర్కొంది. ఇప్పుడు ఇది పూర్తిగా కనుమరుగైంది. తుపాన్లు వచ్చినప్పుడల్లా ఆస్తులు కోతకు గురికావడం, అధికారులు వచ్చి మత్స్యకారులకు హామీలివ్వడం పరిపాటిగానే మారింది. తీరప్రాంతం రక్షణకు శాశ్వత పరిష్కారం చేపట్టపోతే భవిష్యత్తులో ఉప్పాడ గ్రామం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడి తీర ప్రాంతం కిలోమీటర్ల మేర కోతకు గురవడంతో పాటు, రూ.కోట్ల విలువైన ఆస్తులు, భూములు, ప్రభుత్వ భవనాలు కడలిలో కలిసిపోయాయి.

వైఎస్ హయాంలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మాజీ కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి ఎంఎం పళ్లంరాజు చొరవతో సుమారు రూ.12 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంతంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రక్షణగోడ నిర్మించారు. అనేక తుపాన్లతో పాటు విలయం సృష్టించిన హుద్‌హుద్ తుపాన్ నుంచి ఉప్పాడ తీరప్రాంతం కోతకు గురికాకుండా రక్షణగోడగా నిలిచింది. ఇప్పుడు అది సముద్రంలో కలసి పోయింది.


తీరంలో కోతకు గురవుతున్న మత్స్యకారుల ఇళ్లు


సముద్ర గర్భంలో కలుస్తున్న సీసీ రోడ్డు